ఊపందుకున్న ఉపాధిహామీ పనులు

చెరువులో పూడిక పనులు చేపడుతున్న కూలీలు

బాన్సువాడ రూరల్, మే 24 : బాన్సువాడ మండలంలోని ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు పూర్తిగా ముగియడంతో ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్య భారీగా పెరిగింది. మండలంలోని బోర్లం, హన్మాజీపేట్, కోనాపూర్, దేశాయిపేట్, ఇబ్రహీంపేట్ గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పెద్ద గ్రామాలు కావడంతో కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. శుక్రవారం మండలంలో కొనసాగుతున్న ఉపాధి పనులకు మూడు వేల 500 మంది కూలీలు వచ్చారని ఏపీవో గంగాధర్ తెలిపారు. కూలీల డిమాండ్‌ను బట్టి గ్రామాల్లో కావాల్సిన పనులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేయించేలా కూలీలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు

బాన్సువాడ, మే 24 : బాన్సువాడ మున్సిపల్ పరిధిలో ఉన్న వెంచర్లు, పట్టణంలో చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ విషయమై బాన్సువాడ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పలువురు మున్సిపల్ చైర్మన్ గంగాధర్‌తో కలిసి కామారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. లే అవుట్లు చేపట్టిన స్థలంలో కరెంటు స్తంభాలు, వైర్లు, డ్రైనేజీలు, రోడ్లు, మొక్కలు నాటకపోవడం, వెంచర్లలో పార్కు సౌకర్యం కల్పించకపోవడం లాంటి పనులకు అప్పటి అధికారులు రియల్ వ్యాపారుల వద్ద డబ్బులు దండుకొని అనుమతులు ఇచ్చారని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు జరిగిన లే అవుట్ల వివరాలు సేకరించి, ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన వెంచర్ల నిర్వాహకులు, అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాశం రవీందర్‌రెడ్డి, నర్సుగొండ, బాడి శ్రీనివాస్, హకీం, మోతిరామ్, కిరన్ కుమార్, అమేర్ చాహుస్, నార్ల నందకిశోర్, అహ్మద్, రాజు, వెంకటేశ్ ఉన్నారు.

కంపోస్ట్ షెడ్డు, నర్సరీల పరిశీలన

బరంగెడ్డి గ్రామంలో కంపోస్ట్ షెడ్డును పరిశీలించిన అధికారులు

బాన్సువాడ, మే 24 : బీర్కూర్ మండలంలోని బరంగేడ్డి గ్రామంలో కంపోస్ట్ షెడ్డు, నర్సరీ, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని ఎంపీవో అనిత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిదని అన్నారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

కామారెడ్డి జిల్లా ప్రజలు సౌమ్యులు

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 24 : కామారెడ్డి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని,ఇక్కడి ప్రజలు ఎంతో సౌమ్యులని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాభిప్రాయం, ప్రజా సమస్యలపై అధ్యయనం చేసేందుకు జిల్లాకు వచ్చిన 27 మంది కేంద్ర సెక్రటరియేట్ బృందంతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులపాటు జిల్లాలోని పద్మాజివాడ, శివాయిపల్లి, నర్సన్నపల్లి, దోమకొండ, ఫరీద్‌పేట గ్రామాల్లో చేపట్టిన పలు కార్యక్రమాలను నిశితంగా అధ్యయనం చేసి సందేహాలను ప్రస్తావించడంపై కలెక్టర్ ప్రశంసించారు. బృందం ఐదు రోజుల పాటు పాఠశాలలు, డిజిటల్ తరగతులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామీణ ఉపాధి హామీ పనులు, స్వయం సహాయక బృందాల పనితీరు, దవాఖానలు, విద్యుత్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు, అంతర్గత రహదారులు తదితర అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. కార్యక్రమంలో డీఆర్డీవో చందర్, ఉమ్మడి జిల్లా హెచ్‌ఆర్‌డీ డాక్టర్ వసుందర పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

మాచారెడ్డి, మే 24 : మండలంలోని కాకులగుట్టతండా గ్రామానికి చెందిన భూక్యా భాస్కర్(23) దుబాయిలో ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం గ్రామానికి మృతదేహం చేరుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్యా భాస్కర్ రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడన్నారు. అక్కడ పనిచేస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరగడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. శుక్రవారం గ్రామంలోఅంత్యక్రియలను నిర్వహించారు. మృతుడికి తల్లిదండ్రులు శర్మన్-హంసి ఉన్నారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కామారెడ్డి, మే 24 : జిల్లా కేంద్రంలో మౌలిక వసతులు కల్పనకు తగిన ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలపై చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నిధుల కొరతను అధిగమిస్తామన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు, పట్టణ ప్రణాళిక సిబ్బంది, కౌన్సిలరులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజనూ కొనుగోలుచేయాలి

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దోమకొండ, మార్చి 24: కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని చివరి గింజవరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ కానుగంటి శారద, జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ అధికారులకు సూచించారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా సేకరించాలన్నారు. ధాన్యాన్ని తరలించడంలో అలసత్వం వహించొద్దన్నారు. ధాన్యాన్ని తీసుకెళ్లని రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. మరో మూడు రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తవుతుందని తహసీల్దార్ సంజయ్ రావు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని బురుజు వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీపీ సూచించారు. రైతులు అధికారుల సూచనల మేరకు విత్తనాలను కొనుగోలు చేయాలని ఏవో పవన్‌కుమార్ పేర్కొన్నారు. చెరువుల వద్ద తూములను పరిశీలించి లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని సభ్యులు సూచించారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఏపీవో తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు రాజేశ్వర్, రమేశ్, శంకర్, జ్యోతి, వెంకటలక్ష్మి, దోర్నాల లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షమ్మి, ముత్యంపేట సొసైటీ చైర్మన్ తిరుపతిగౌడ్, ఇరిగేషన్ డీఈ అర్చన, మెడికల్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, భానుప్రియ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కామారెడ్డి రూరల్, మే 24 : గ్రామాల్లో ఏమైనా పనులు మిగిలి ఉంటే త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అన్నారు. కామారెడ్డి మండలం దేవునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో కామారెడ్డి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుబంధు, జీవిత బీమా, విత్తనాలు, పీఎం కిసాన్, పంట నమోదు కార్యక్రమం, అమ్మ ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్వాక్రా సంఘాలు, విద్యుత్, మత్స్య శాఖలతో చర్చించారు. పూర్తి కానివి ఏమైనా ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపీపీ నరేశ్, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, ఎంఈవో ఎల్లయ్య, ఏవో శ్రీనివాస్ ,ఆర్ అండ్ వీ ఈఈ శ్రీనివాస్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు : డీఈవో

కామారెడ్డి, మే 24 : జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల ఆవరణలో బుక్స్, యూనిఫామ్‌లను విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేసినట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఎక్కువ ఫీజులను వసూలు చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తే చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడంతో పాటు అనుమతులు రద్దు చేస్తామని అన్నారు.

బీడీ కార్మికుల వేతనాలు పెంచాలి

మాచారెడ్డి, మే 24 : రాష్ట్రంలో పని చేస్తున్న బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం అన్నారు. మండలంలోని అక్కాపూర్ గ్రామంలో బీడీ కార్మికుల తో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు 40 శాతం పెంచాలని, నెలసరి ఉద్యోగులకు రూ.3 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం, నెలలో 26 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణా, మల్లవ్వ, ప్రేమల, భారతి, నర్సవ్వ, హైమవతి, అంజవ్వ పాల్గొన్నారు.

గ్రామ సంఘాల ఆడిట్

భిక్కనూరులో రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్లు

భిక్కనూరు, మే 24 : మండలంలోని మహిళా సంఘాలతో కొనసాగుతున్న గ్రామ సంఘాల పుస్తకాలను కరీంనగర్ జిల్లాకు చెందిన ఆడిటర్ల బృందం భిక్కనూరు మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల పుస్తకాలను శుక్రవారం ఆడిట్ చేసింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఆర్థిక లావాదేవీల పుస్తకాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆడిటర్లు రవిరాజ్ కిరణ్, పవన్, మండల సమఖ్య అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి విజయ, కోశాధికారి గంగాలక్ష్మి, అకౌంటెంట్ అన్నపూర్ణ, కంప్యూటర్ ఆపరేటర్ నరేశ్, డీఎంజీ రాము, ఏపీఎం, శ్రీనివాస్, వీఏవోలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత

భిక్కనూరు, మే 24 : భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ఈతకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షీ టీం, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రభాకర్, సాయిలు, శేషారావు, షీటీం బృందం పీసీ భూమయ్య, రాజేందర్, పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 24: ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృతమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8074099971 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉప్పల్‌వాయి కాలేజీలో..

రామారెడ్డి, మే 24: మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు http://tswreis.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉన్నదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

మద్నూర్, మే 24: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని మేనూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. డోంగ్లీ మండలంలోని కుర్లా, సిర్పూర్ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని మద్నూర్‌కు చెందిన ఇద్దరు, ఇలేగావ్‌కు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

29న వైస్ ఎంపీపీ ఎన్నిక

నాగిరెడ్డిపేట, మే 24: వైస్ ఎంపీపీ ఎన్నికను ఈనెల 29వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పర్భన్న శుక్రవారం తెలిపారు. గతనెల 4వ తేదీన ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న వైస్ఎంపీపీ రాజ్‌దాస్‌పై ఎంపీటీసీ అవిశ్వాసం ప్రకటించారు. తొమ్మిది మంది సభ్యులకు ఆరుగురు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గింది. కాగా.. కొత్తగా వైస్ ఎంపీపీని 29వ తేదీన ఎన్నుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు. దీంతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ..

ఎల్లారెడ్డి రూరల్, మే 24: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ కళాశాలలో నిర్వహించారు. ఆదర్శ కళాశాలలోని సెంటర్‌లో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సర తెలుగు పరీక్షకు 43మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరు అయ్యారని, ద్వితీయ సంవత్సర తెలుగు పరీక్షకు ఎనిమిది మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ప్రథమ సంవత్సర పరీక్షకు 13 మందికి గాను ఒక్కరు గైర్హాజరు అయ్యారని, వొకేషనల్ పరీక్షకు మొత్తం ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారన్నారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 37మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజరు కాగా, వొకేషనల్ పరీక్షకు మొత్తం 12మంది హాజరయ్యారన్నారు.

విత్తనాల దుకాణం తనిఖీ

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో సౌమ్య

సదాశివనగర్‌లోని విత్తన విక్రయ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో ప్రజాపతి

రామారెడ్డి, మే 24: సదాశివనగర్‌లోని విత్తనాల విక్రయ దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి శుక్రవారం తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వివరాలను తప్పకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రసీదును తప్పకుండా తీసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను ఆయన తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన..

బిచ్కుంద, మే 24: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో సౌమ్య అన్నారు. ఏవో రాజలింగం ఆదేశాల మేరకు ఆమె మండలంలోని ఖత్‌గావ్, మెక్క గ్రామాల రైతులకు విత్తనాల కొనుగోలుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆదికృత డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. పొలాల్లోని వరి కొయ్యలను తగలబెట్టొద్దని, కలియ దున్నాలని సూచించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, హన్మంత్, పీరాజీ, జైరాం తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన

పోచారంలోని శ్మశాన వాటికలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎల్పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, మే 24: మండలంలోని పలు గ్రామాలను డీఎల్పీవో సురేందర్ శుక్రవారం సందర్శించారు. పోచారం, మాల్తుమ్మెద, లింగంపల్లి కలాన్, ధర్మారెడ్డి, రాఘవపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఆయన పరిశీలించారు. గ్రామాల వారీగా తనిఖీలు చేపట్టిన ఆయన.. వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ క్రీడా ప్రాంగణాల చుట్టూ గుంతలు తవ్వించి, కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారీగా గ్రేడ్ నిర్ణయించి నివేదికను పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో ఐదు గ్రామాల చొప్పున పరిశీలించనున్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించాలి

శివ్వాపూర్‌లో కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీవో

బిచ్కుంద, మే 24: గ్రామాల్లోని రైతులు సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. మండలంలోని పుల్కల్, చిన్న దేవాడ గ్రామాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో డంపింగ్ యార్డులను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. యార్డుల్లో సేంద్రియ ఎరువులను తయారు చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ఎరువులను తయారు చేయాలి..

ఎల్లారెడ్డి రూరల్, మే 24: కంపోస్ట్ షెడ్లలో ఎరువులను తయారు చేయాలని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. మండలంలోని శివ్వాపూర్ గ్రామంలో ఉన్న కంపోస్ట్ షెడ్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. ఇండ్ల నుంచి సేకరిస్తున్న చెత్తతో 45రోజులకు ఒకసారి సేంద్రియ ఎరువును తయారు చేయాలని సూచించారు. గ్రామంలోని నర్సరీ, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతివనాను పరిశీలించారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

బోరుబావుల వద్ద ఫాం పాండ్లు నిర్మించాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో పర్భన్న

నాగిరెడ్డిపేట, మే 24: మండలంలోని రైతులు తమ బోరుబావుల చుట్టూ ఫాం పాండ్లు నిర్మించుకోవాలనిఎంపీడీవో పర్భన్న అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం పాండ్ల నిర్మాణంతో ఎండాకాలంలో బోరుబావులు వట్టిపోవని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని, కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కొమలంచతో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

నిజాంసాగర్, మే 24: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. మహ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్, కొమలంచ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ క్రాంతికుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. కొనుగోళ్లు, తరలింపు విషయాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆయనవెంట సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

జప్తిజాన్కంపల్లి ఊరచెరువు సర్వే

చెరువు సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట, మే 24: మండలంలోని జప్తిజాన్కంపల్లి ఊర చెరువు సర్వేను శుక్రవారం చేపట్టినట్లు సర్వేయర్ అభిలాష్ తెలిపారు. చెరువు కబ్జాకు గురవుతున్నదని రెండు నెలల క్రితం మాజీ సర్పంచ్ సాయిలుతోపాటు గ్రామస్తులు తహసీల్దార్ నారాయణకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో గ్రామస్తుల సమక్షంలో సర్వే చేపట్టి శిఖం హద్దులను గుర్తించారు. జప్తిజాన్కంపల్లి, బొల్లారం శివారులో 108 ఎకరాల చెరువు భూమి ఉన్నదని సర్వేయర్ తెలిపారు. 25ఎకరాల వరకు కబ్జాకు గురైందని, పూర్తి వివరాలు తహసీల్దార్‌కు అందజేస్తామని చెప్పారు.

మద్నూర్‌లో కుస్తీ పోటీలు

బహుమతిని అందజేస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

మద్నూర్, మే 24: మండల కేంద్రంలో రథోత్సవం సందర్భంగా శుక్రవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పోటీలను తిలకించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. పోటీల నిర్వాహకులు షిండేను ఘనంగా సన్మానించారు.

విత్తనమేళాలో ఎల్లారెడ్డి రైతులు

రైతుమేళాలో పాల్గొన్న ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట రైతులు

ఎల్లారెడ్డి రూరల్, మే 24: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విత్తనమేళాలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఈ మేళాలో విత్తనశుద్ధి, మేలురకం విత్తనాల వాడకంతో వచ్చే దిగుబడి తదితర విషయాలను వివరించారని వారు తెలిపారు. పలు రకాల విత్తనాలను విక్రయించేందుకు అందుబాటులో ఉంచారని అన్నారు.